# మంచు తెరలా - కంచు మరలా

ఆడపా చిదానంద్ శ్రీ భువనేశ్వర్

ఆ పార్కు చక్కగా ముద్దొచ్చే టట్టుంది.

సముద్ర సామీప్యంలోనే ఆ చిన్ని పార్కును యేర్పాటు చేయడం ప్రత్యేక సౌందర్యాన్ని ప్రతిష్టం చేసినట్లయింది.

అతనొక్కడే వచ్చాడు. హృదయంలో అమితంగా బాధపడుతున్నాడని ... అద్దం లాంటి ముఖారవిందం అర్థం చెప్ప సాగింది. అందుకే అతను తలవంచుకునే నడిచివచ్చాడు లా వుంది.

మా మిత్రుడన్నట్టు... నిప్పు లేందే పొగ రాదుగా! అతని బాధ కేదో కారణముండాలి. గడ్డిలో కూర్చుని స్వగతానికి స్వాగతం చెప్పుకున్నాడు.

డేవిడ్, సుందరం ఫైనలియర్ క్లాస్ మేట్సు. రాగిణి, నందిని, మేరీ...జూనియర్సు రాగిణి ఆ యేడే 'మొదటి సంవత్సరంలో' జాయినయింది.

అందరికీ రాగిణి అంటే అమితమయిన మోజు వుంది. ఆమె ఎంత నిరాడంబరంగా వున్నా...ఆడంబరంగా వున్నట్లే కనిపించడం ఓ ప్రత్యేకత. మరి! అతని ఊహాలోకంలో... కాల కన్య జాలిపడి కాసేపు ఆగింది. మాసిపోయిన నిన్నటి రోజు ముందుకు వచ్చింది.

కాలేజీలో...

ఎలక్ట్రిక్ బెల్ రింగయింది, సెకెండవరు ముగిసిందంటూ. కాలేజీ ముందు కాంక్రీటు రోడ్డుపై తనూ, డేవిడ్, సుందర్, నడుస్తుంటే ...తమకు మూడడుగుల దూరంలో రాగిణి ఒంటరిగా నడుచుకుని పోసాగింది.

'అబ్బ! నందన వనంలో వుండవలసిన వన మయూరం రోడ్డు మీదికి వస్తే...హృదయం తోనే ఫోటో తీసినా......' ఇంకా ఏమిటో యేమిటో...యింగ్లీషులో చెప్పుకుపోతున్న డేవిడ్‌ను వారిస్తూ...'అంత పైత్యం పనికి రాదురా' అన్నాను. అంతలో అందరం... ఆమెకు సమీపంగా వచ్చాం.

నాగిని లా కదలాడు. ఆ నల్లటి నిగనిగల జడలోన తెల్లటి పుష్పం! డేవిడ్ చెయ్యి అటువేపు వెళ్ళింది. అది ఆమెను తాకింది. చటుక్కున తల యెటో తిప్పేసుకున్నాడు డేవిడ్. విరాగినిలా నడుచుకు పోయే...రాగిణి త్రాచుపాములా బుసకొడుతూ వెనక్కు తిరిగింది.

ఆమె వెనక్కు తిరగ్గానే అగుపించింది నేను డేవిడ్ తరుపున 'సారీ' చెబ్దా మనుకున్న... తన చెంప ఛెళ్ళుమంది.

అతను మృదువైన తన చెంప తడుముకుంటూ 'ఛీ' అనుకున్నాడు. తను నలుగురిలో ఎంత అప్రతిష్ఠుడై పోయాడు!

తరువాత 'ఒరే క్షమించరా' అంటూ వచ్చాడు బడుద్దాయి డేవిడ్.

'అంతకన్నా యింకేం చెయ్యగలను? అంత ఓవర్‌గా బిహేవ్ చెయ్యకురా అంటే వింటావ్రా? ఒక్కసారి చెప్పగా విన్నవాడే మనిషి!' అన్నాను.

అతికష్టం మీద అప్ ఎక్కి వచ్చిందిబస్సు చోటులేదు. ఎలాగో ఓకలా ఎక్కేయడం అలవాటే! డేవిడ్, సుందర్ యింకో బస్ కోసం వెయిట్ చేస్తూ 'చిరియో' చెప్పారు.

వంగుని చూస్తే నందిని, మేరీ, బస్ ఎక్కుతున్నట్లు అగపడింది. ముందు 'స్టాపు'లోనే ఎక్కేసింది గాబోలు...రాగిణి... ఓమూల నిజంగా విరాగిణి లాగే కూర్చుని వుంది. నేను వాళ్ళ కళ్ళకి అగపడకుండా ... అతి కష్టం మీద ఒదిగి ఒదిగి నిల్చున్నాను.

బస్సు భారంగా...నిట్టూరుస్తూ కదిలింది. ఓ పదినిముషాల ప్రయాణంలో బస్సు బాగా పల్చపడిపోయింది! ఈసారి నేను...దూరంగా వెనుతిరిగి కూర్చున్నాను. తలమాత్రం తిప్పి చూస్తే.. రాగిణి, నందిని, మేరీ ఎదురెదురు సీట్లలో కూర్చుని వున్నారు.

జైలురోడ్డు వెనక్కు పోతూ వుంటే చక్కటి మాటలు చెవులను సోకసాగాయి.

'రాగిణీ చాలా తొందర పడ్డావు సుమా!. అంది మేరీ. 'అంత ఇన్నాల్టయినా బ్రదించుకు పోవడానికి మనమేం ఋణపడి వున్నామా ఏమిటి? నా పాలసీ అంతే! వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి!' రాగిణి గొంతు ఘాటుగా వుంది.

అంతవరకూ వినిపించని మరో పెంకి గొంతు ఈసారి మధురంగా విన్పించసాగింది. 'యువర్ ఆనర్! ఒప్పుకున్నాం 'ఎండ్' మెచ్చుకున్నాం గాని...అసలు దొంగని వదిలేశావే లేడి పిల్లా!'

అంతా క్షణికం కిల కిల మన్నారు.

'అబ్బబ్బ! ఏవిటా శబ్దా చప్పుడు? రాగిణి గొంతు.

'కాదే రాణీ మణీ! చూశావూ? అశాటిన్ కౌబాయ్ ట్రౌషర్ పాయింటెడ్ ష్యూ... టక టక లాడిస్తూ ఉఫ్ న పొగవదులుతూ నడుస్తాడే వాడే నీ మృదు మధుర వీణా విపంచిని మీటబోయి...' అర్ధోక్తిలో... ఆపేయాలని ఆపేసి.....నవ్వాలనుకోకుండా నే ఫక్కుమంది.

అందరూ కడుపుబ్బ నవ్వుతుంటే డ్రైవరూ కండక్టరూ వెనక్కోమారుచూసి...నవ్వుతూ ఏదో మాట్లాడుకొన్నారు.

'అబ్బ! ఏమిటిదంతా? ఫూలింగా!' అంది రాగిణి.

'ఒసేయ్ నేనసలు సంగతి చెప్తా విను' అంటూ మేరీ ... జరిగినదంతా చెప్తూ...' అసలు మేం వాళ్ళ వెనుకేగా వస్తూంటా!' అని ఆపింది.

కాసేపు ఆలోచించింది గాబోలు...చాలా సేపు నిశ్శబ్దంగా వూరుకుంది. ద్వారకానగర్ లో బస్ ఆగీ అగగానే నేను దిగిపోయి యింటి ముఖం పట్టాను.

'బాబూ! కాస్త లేస్తారా?' తోటమాలి లేవదీశాడు నన్ను. ఇహంలోనికొచ్చిన నేను ...'అరె! గతజల సేతుబంధనతో చాలా సేపు గడిపేశానే!' అనుకుంటూ లేచాను... ఆనాడు...ఆ పార్కులో...!!

అంతలో తియ్యని కోకిల పలుకులా... వీణానాదంలా...ధ్వనించింది. వెనక్కు తిరగ్గా ...ఆమె కన్పించింది!

'అరె! మీరా ... ఏవిటండోయ్ యిలా వేంచేశారు!' అనేశాను దిక్కుతోచక. ఆమె మౌనం చూస్తూ ... 'మీకో చిన్న పరివారం వుండాలే...ఏదీ ఎక్కడ దాక్కుంది?' అంటూ నవ్వుతూ చుట్టూ కలియజూశాను.

ఆమె ఎదురు పడితే...నానా రభసాచేసి ...తనకు బుద్ధి చెప్ప జూస్తాడు గాబోలు అనుకుంటూ వచ్చి వుంటుందీ అమ్మాయి. ఆ మౌనంలో ఆ అర్ధమే కనిపిస్తుంది నా 'ఎస్ రే' కళ్ళకు 'ఏమిటండీ అలా చూసు

న్నారు' అన్న మాటతో ఆమె ఈ లోకాన పడి...' నా ఎపోలజీని ఏ...ఎల్లా తెల్పుకోవాలో తెలీటం లేదండీ!' అంది భయంగా బెరుకుతూ.

నాకెప్పుడూ రానంత నవ్వు వచ్చింది. ఆపుకో లేదు.

'చూడండి రాగిణీగారూ! క్షమార్పణ కిందులో ఏముంది? ఆ మాత్రపు పొరపాట్లు అందరికీ వస్తుంటాయి' అని వూరుకున్నాను...

అలా ఏర్పడింది రాగిణితో తన పరిచయం కొత్తలో!! రెండున్నర సంవత్సరాల క్రితం జరిగిన కథ యిది!

తనకిపుడు 'ఎమ్. కామ్' పూర్తయింది. సుమారు గంటన్నర నుండి వేదిస్తున్నదీ రాగిణీ తమ పెళ్ళిపై నా అభిప్రాయం ఏమిటంటూ...!

'ఏమిటానంద్? బీచ్‌కి వచ్చి గంటన్నర దాటేసినా ఒక్క ముక్క మాట్లాడవూ?... ముత్యాలు రాలిపోవులే!' రాగిణీ అంది...కంద గడ్డలా ముఖం పెట్టి!

ఆమెలో రక రకాల భావ సంచలనంకల్గుతున్నా పైకి మాట్లాడేస్తున్నది. ఆమె ఆనందును ప్రేమించింది, తన జీవిత భాగస్వామిగా ఎన్నుకుంది, అతనెప్పుడూ పెళ్ళి సంగతి ఎత్తకపోవటమే ... ఈమెలో భయాన్ని రేకెత్తించింది. కొత్తగా ఆనంద్‌తో చాలామంది అమ్మాయిలు పరవశులై మాట్లాడుతుంటే... ఆనంద్ కూడా వాళ్ళలో మిళితమైపోవడం రాగిణీకి ఈర్ష్యను కల్గిస్తుంటుంది.

మగవాళ్ళను నమ్మకూడదు! అని కూడా చాలాసార్లు అనుకుంది కాని తన ప్రియుని సంగతి గుర్తుకు రాగానే...'ఛ ఛ... ఆనంద్, చాలా మంచివాడు' అనుకొనేది.

ఆమె మానసం 'కంచుమర'లా పనిచేయ సాగింది. ఆనంద్ ఏమాట అన్నా...కంచు ధ్వనిస్తూ మర పనిచేస్తుంది. రక రకాలుగా అర్థాలను విడమర్చి చెప్తుంది.

అవతల ఆనంద్‌లో మానసిక సంఘర్షణ ఇంకోలా సాగింది. ఇన్నాళ్ళుగా తన హృదయంలో దాచుకొని తన సర్వస్వంగా ప్రేమిస్తున్న తన రాగిణీయేనా ఇంత అనుమానంలో కొట్టుకుపోతున్నది?

నేను తనను మోసం చేస్తానేమో అనే గాభోలు రాగిణీకిభయం, నావిషయంలో అంత భయమెందుకో! ఎంత ప్రేమిస్తున్నా... స్త్రీలకు అటువంటి భయాలు...ఆ అగాధమయిన హృదయసాగరంలో...ఏదో మూల వుండి. తీరుతుంది గాభోలును.

అయినా ఆ మాత్రపు భయం వుండాలిలే! ఎన్నెన్ని మోసాలు జరగటం లేదు? ఇది ఒక లెక్కా ఏమిటి. ఏది యేమయినా తాము త్వరలో పెళ్ళి చేసుకోవాలి. లేకపోతే... అనవసర వాగ్వివాదాలతో ఆలోచనలతో అమూల్యమయిన సమయం వృధాఅవుతోంది!

ప్రేమికులకు పెళ్ళంటే కాస్త భయం పుడుతుంది. అయినా ఆ భయం ఎవ్వరికీ కనపడనిది మాత్రమే! ఈ భయం ఉత్త మంచు తెర లాంటిది.

మంచులో...దూరాన దారి కనబడదు. కాని...ధైర్యంగా ముందుకు నడుస్తుంటే మన దారి మనకు నిర్మలంగా కన్పిస్తుంది.

పెళ్ళంటే భయమనుకున్నావా? అది ఒక మంచు తెర! నువ్వు అనవసరమయిన ఆలోచనలతో...నీ మనసును 'కంచుమర'లా చేసుకుంటున్నావు. లే...పోదాం... అంటూ ఆమెలోనే లేచాడు.

# ఊహాలోకం

రచన:
మాస్టర్ రవి

ఊహాలలో వూయలలూగడం, ఆశల్ని భోం చెయ్యడం. మానవుడికి అలవాటు, సరదా. తరతరాల్నుండీ జీర్ణించుకు పోయిన భావం కూడా ఇదే.

ఊహించుకుంటూ, భవిష్యత్తు కలలు కనడం-అనేదే లేకపోతే, మానవుడికి-వునికి జీవితం వుండనే వుండవేమో అనిపిస్తుంది. బాధల్ని, గాధల్ని తలుచుకుంటూ, మానవుడు ఎంతకాలం జీవించగలడు? వాటిని మరపుల అవనిక ఆక్రమించగనే, తియ్యగా భవిష్యత్తు ఆశిస్తూ జీవితం వూహిస్తూంటాడు. ఇది సహజం. ఈ ఊహించే శక్తి, ఆశ అనే పదం సృష్టిలోనే లేకపోతే, ఈ ప్రపంచం ఎలా వుంటుందో వూహించాల్సి వుంది!-చూశారా-మళ్ళా ఇక్కడ కూడా వూహించడమే వచ్చింది.

రచయితలు, కవులు చాలామట్టుకు చేసేది వూహాగానమే! వారు వూహించి కాల్పనిక జగత్తును మన ముందు వుంచి. తీయగా హాయిగా, భోం చెయ్యమంటారు. జీర్ణించుకుని జీవించమంటారు. అయితే, ఈ వూహాగానాలన్నీ నిజం కావాలని వారెంతో కృషి చేస్తారుకూడా! "కృషితో నాస్తి దుర్భిక్షం" గదా!!

× × ×

పతిత అయిన కూతుర్ని ఇంట్లో పెట్టుకుని ఆ తండ్రి ఎలా జీవించగలుగుతున్నాడు? యౌవ్వనప్రాంగణంలో ప్రవేశించిన తొలి వసంతంలోనే పసుపుకుంకుమ నోచుకోని దౌర్భాగ్యురాలు, ఎలా ఆనందాన్ని చేరువ చేసుకోగలుగుతోంది? ఏమి ఆశించి బ్రతుకుతోంది?

వరించిన వనిత మోసం చేసి, ఇంకొకరి సొత్తయినప్పుడు, భగ్న ప్రేమికుడు గాఢాంధకారబంధురమైన తన జీవితాన్ని ఎలా గడపాలని, ఏం చూసుకుని-ప్రాణాల్తో వుంటున్నాడు??

అమాయకుడైనా, నీచలోకం వేసిన ముద్రకులొంగి, వొంగి, సలాముచేసి 'దొంగ'గా గుర్తింపబడే ఆ అభాగ్యుడు ఎలా శ్వాస తీసుకోగలుగుతున్నాడు?

మరి ఇలాటివన్నీ ప్రశ్నలే! వీటన్నిటికీ జవాబు ఒక్కటే- 'ఆశ' ఈక్షణం నరకమే అయినా, మరుక్షణం మధురం కాకపోతుందా-అనే ఆశతోనే జీవిస్తున్నాం మనమంతా! ఇది నిత్యం! ఇదే సత్యం!! ఆశ లేకపోతే-మానవ జీవితమే లేదు. మిగిలేవి సమాధులే!!

అయితే అది-అంటే ఆ ఆశ-'దురాశ-పేరాశ' - కాకపోతే, అంతకన్న ఇంకేం కావాలి??